ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 29.0 • కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
శనివారం 5 జూలై 2025





ఎట్టకేలకు..

సుంకేసుల బ్యాక్‌వాటర్‌లో డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక తోడివేత ప్రారంభం

- ఈ పద్ధతిలో నాలుగేళ్ల క్రితం నుంచే ఆంధ్రప్రదేశ్ వైపు ఇసుక తవ్వకం
- అటువైపు పల్లం ఏర్పడటంతో తుమ్మిళ్ల పంపులకు అందని నీరు
- 7.25 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తోడేందుకు అనుమతి
- మే 19న టెండర్ నోటిఫికేషన్.. 2 రోజుల క్రితం మొదలైన తోడివేత



డ్రెడ్జింగ్ పద్ధతిలో బోటులో తెచ్చిన ఇసుకను బయటకు తీస్తున్న ఎర్త్ మూవర్స్



బోటులో నింపిన ఇసుక

డ్రెడ్జింగ్... ఈ పద్ధతితో నదిలోని ఇసుకను తవ్వుతారు.. ఈ విధానం కొన్నేళ్లుగా సుంకేసుల బ్యాక్‌వాటర్‌లో ఏపీ అమలు చేస్తోంది.. ఇటు తెలంగాణ వైపు పట్టింపు లేకుండా పోయింది. దీని పర్యవసానంగా నదిలో ఇసుక ఒకవైపు తగ్గి నీరు తక్కువగా ఉన్న సమయంలో ఇటువైపు ఉన్న తుమ్మిళ్ల పంపులకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు నదిలో లభ్యం అవుతున్న ఇసుకను ప్రజావసరాలకు ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎట్టకేలకు తెలంగాణవైపు కూడా నది నుంచి ఇసుకను తీయడం ప్రారంభం కావడంతో నీటి లభ్యతతో పాటు ఇసుక కొరత తీరే అవకాశం ఏర్పడింది.

మహబూబ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎట్టకేలకు సుంకేశుల వద్ద డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుక తోడివేత ప్రారంభమైంది. ఏళ్లుగా ఈ పద్ధతిని ఉపయోగించి ఏపీ ఇసుక దోపిడీ చేస్తున్నదన్న ఆరోపణల నేపథ్యంలో ఇక్కడా ఈ పద్ధతిని వినియోగించాలని ప్రతిపాదనలు రాగా రాష్ట్ర ఖనిజాభివృద్ధి శాఖ ఆ దిశగా చర్యలు ప్రారంభించలేదు. అయితే సుంకేసులలో ఏడాది పొడవునా నీటి లభ్యత ఉంటడంతో ఇసుక తవ్వకం తెలంగాణవైపు కఠినంగా మారింది. ఏపీలో ఈ విధానం అమల్లో ఉండటంతో తెలంగాణ వైపునకు వచ్చి ఇసుకను తోడుకెళుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుక తోడేందుకు మే 19వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయగా జితన్ మినరల్స్ కంపెనీ టెండర్‌ను దక్కించుకొని రెండు రోజుల క్రితం తవ్వకాలు ప్రారంభించింది. మొత్తం 7.25 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను ఈ పద్ధతిలో తోడనున్నారు. నీటి నిల్వ ఉన్న సమయంలో ఈ విధానం చాలా ఉపయోగపడనుంది. వాస్తవానికి కృష్ణా బేసిన్‌లో ఇసుక లభ్యత చాలా తక్కువగా

(మిగతా 7లో..)

తుమ్మిళ్ల ఆయకట్టుకు మేలు...

రాజోలి బండ డైవర్షన్ స్కీం కింద తెలంగాణకు 15.90 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయి. మొత్తం 87,500 ఎకరాల ఆయకట్టుకు ఆర్డీఎస్ ద్వారా నీరందాల్సి ఉంది. కానీ దశాబ్దాలుగా కేటాయింపుల మేర నీటిని వినియోగించుకోలేని పరిస్థితి ఉన్నది. కాలువ మరమ్మతులతో కనీసం 30వేల ఎకరాలకు కూడా నీరందడం లేదు. ఈ నేపథ్యంలో 2018లో రాజోలి మండలంలో ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా నీటిని దిగువన వాడుకునేందుకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. దీని ద్వారా 50 వేల ఎకరాలకు నీరందించాలి. కానీ తుమ్మిళ్ల ద్వారా కూడా ఆ ప్రత్యామ్నాయ ఫలితాలు రావడంలేదు. దీనికి ప్రధాన కారణం మూడు మోటార్లలో ఒకే మోటార్ నడవడం, నీటినిల్వకు రిజర్వాయర్లు నిర్మించకపోవడం, ఆర్డీఎస్ ఎడమ కాలువ, డెలివరీ సిస్టర్న్ చిన్నగా ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇదే కాకుండా కేవలం ఏపీ డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుక తవ్వడం వల్ల అటువైపు పల్లం ఏర్పడి తుమ్మిళ్ల మోటార్లకు నీరందని పరిస్థితి ఉన్నది. రెండేళ్ల క్రితం పంటలు ఎండిపోతుండటంతో నీటి ఒత్తిడిని అడ్డుకునేందుకు తుమ్మిళ్ల అప్రోచ్ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన బండ్‌ను కూడా కొంతమేర తొలగించారు. అయినప్పటికీ నీరు అందకుండా పోతోంది. 2024 జూన్ నుంచి 2025 మార్చి వరకు 300 టీఎంసీలు సుంకేసుల ద్వారా దిగువకు వెళ్తే కేసీ కెనాల్‌కు 35 టీఎంసీలు వెళ్లాయి. కానీ తుమ్మిళ్ల ద్వారా ఆర్డీఎస్‌కు కేవలం 3.529 టీఎంసీలను మాత్రమే మళ్లించుకోగలిగాం. 50 వేల ఎకరాలకు నీరందించాలంటే కనీసం 6 నుంచి 7 టీఎంసీలను రెండు సీజన్లకు కలిపి వాడుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా ప్రక్రియతో మిట్ట తొలగి తుమ్మిళ్ల ద్వారా ఎక్కువ నీటిని వినియోగించుకోవచ్చు.

సమావేశంలో మాట్లాడుతున్న డీజీ చౌహాన్

మా భూములు లాక్కోకండి

- పొలాల్లో నుంచి రోడ్డు వేయడంపై రైతుల ఆందోళన

6

ప్రజలకు రక్షణ కవచంగా పోలీసులు

- విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి
- పోలీస్ డ్యూటీ మీట్‌లో డీజీ ఎల్ఎస్ చౌహాన్

6



నారాయణపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

- వసతుల కల్పన, మరమ్మతులకు రూ. కోటీ 37 లక్షల నిధులు మంజూరు
- నారాయణపేట జిల్లాలోని 8 కళాశాలల్లో చేపట్టనున్న పనులు

జూనియర్ కళాశాలలకు

మంచి రోజులు

నారాయణపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా నిధులు లేక సమస్యలతో సతమతం అవుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మంచి రోజులు వచ్చాయి. వాటిలో సౌకర్యాలను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. నిధులు లేక నీరసించిన కాలేజీల్లో సౌకర్యాల కల్పన, మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఎనిమిదింటికి రూ.కోటీ 37 లక్షలు మంజూరు అయ్యాయి. గుండుమల్, కొత్తపల్లి మండలాని(భూనీడ్)కి సంబంధించి కళాశాలలు ఈ ఏడాది ప్రారంభమయ్యాయి. అయితే వాటికి భవనాలు లేనందున జడ్పీహెచ్ఎస్‌లలో నిర్వహిస్తున్నారు. అందుకే వాటికి నిధులు రాలేదు. మిగతా కాలేజీల్లో ఈ నిధులతో సివిల్, విద్యుదీకరణ, శానిటరీ, నీటి సరఫరా, బోర్‌వెల్స్, ప్రహరీల నిర్మాణం, డ్యూయల్ డెస్కులు, చిన్న చిన్న మరమ్మతు పనులు చేపట్టనున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆమోదంతో తెలంగాణ ఈడబ్ల్యూఐడీ ఇంజనీరింగ్ అధికారుల విభాగం పరిశీలించి, గుర్తించిన పనులకు టెండర్లు పిలిచి చేపట్టనున్నారు. సంబంధిత కాలేజీలకు అవసరమైన పనుల నివేదికలు ప్రిన్సిపాల్స్ ఇంటర్ నోడల్ అధికారి సుదర్శన్ రావుకు పంపిస్తే, అక్కడి నుంచి కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్ ఆమోదించిన పనులు చేపడతారు.

కాలేజీల వారీగా మంజూరైన నిధుల వివరాలు(రూపాయల్లో)

కళాశాల	సివిల్ పనులు	ఎలక్ట్రికల్ పనులు	నీటి సరఫరా	చిన్న చిన్న మరమ్మతులు	మొత్తం
కోస్గి	6,88,503	5,05,644	3,06,044	4,49,809	1,95,0000
నారాయణపేట	4,27,567	4,93,368	2,19,764	3,09,301	1,45,0000
ఊట్కూర్	4,40,401	1,28,647	2,55,875	2,25,077	1,05,0000
దామరగిద్ద	3,66,259	4,69,617	2,61,162	3,02,962	1,40,0000
ధన్వాడ	5,13,313	4,69,617	2,69,252	8,17,435	1,60,0000
మక్తల్	14,17,040	2,24,562	64,568	10,93,830	2,80,0000
మాగనూర్	6,29,408	2,23,013	4,83,693	3,31,886	1,65,0000
మద్దూర్	5,26,608	5,90,104	2,68,037	4,55,251	1,84,0000



ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్‌ను అందిస్తున్న డీఈవో

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- డీఈవో ప్రవీణ్‌కుమార్
- మిడ్జిల్ ఎమ్మార్సీలో భవిత కేంద్రం ప్రారంభం
- ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్ అందజేత

మిడ్జిల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని, ప్రతీ ఉపాధ్యాయుడు విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో భవిత కేంద్రాన్ని డీఈవో ప్రారంభించారు. విద్యార్థులకు అందించే సేవల గురించి తెలుసుకున్నారు. ఏఐ తరగతుల ప్రారంభానికి ఎమ్మార్సీలో ఉన్న కంప్యూటర్‌ను ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జానకమ్మకు అందించారు. కార్యక్రమంలో సీఎంవో బాలుయాదవ్, ఎంఈవో వెంకటయ్య, ఉపాధ్యాయులు రవీందర్, సౌందర్య, సీఆర్పీలు నరసింహ, గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా మారుస్తాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- తెలంగాణ అకాడమీ ఫర్ నాలెడ్జ్ శిక్షణా కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రానున్న రోజుల్లో మహబూబ్‌నగర్‌ను స్కిల్‌డెవలప్‌మెంట్ హబ్‌గా మారుస్తామని అన్నారు. శుక్రవారం నగరంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో గల మునిసిపల్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ అకాడమీ ఫర్ నాలెడ్జ్ శిక్షణా కేంద్రాన్ని(టాస్క్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ టాస్క్ సెంటర్‌ను హైదరాబాద్‌లోని స్కిల్ విశ్వవిద్యాలయానికి అనుసంధానం చేస్తామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దపల్లి తరువాత మహబూబ్‌నగర్‌లో రెండో టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. టాస్క్ సెంటర్‌లో అన్ని రకాల కోర్సులకు అడ్వాన్స్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇంటర్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు ఎవరైనా శిక్షణ పొందొచ్చన్నారు. మొదటి బ్యాచ్‌లో 50 మందికి శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. మెట్టుగడ్డలోని నాన్‌వెజ్, వెజ్ మార్కెట్ కోసం ఏర్పాటు చేసిన భవనాన్ని టాస్క్ సెంటర్‌గా మారుస్తామన్నారు. పీయూ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాపరంగా ఎమ్మెల్యే తీసుకుంటున్న చర్యలను కొనియాడారు. పీయూకు లా, ఇంజనీరింగ్ కళాశాలలను తెచ్చారని, ట్రిపుల్ ఐటీని సాధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ బెక్కరి అనిత, కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు సీజే బెనహర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- గురుకులాలు, హాస్టళ్ల తనిఖీలో కలెక్టర్ విజయేందిర బోయి



దేవరకద్రలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేసి, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర/ జడ్చర్ల/ బాలానగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గురుకుల పాఠశాలలు, హాస్టళ్లను కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శుక్రవారం తనిఖీ చేశారు. దేవరకద్ర మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల, బీసీ హాస్టల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు, విద్యను అందించాలని చెప్పారు. మంచి కూరగాయలతో వంట చేయాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి.. చదువుపై శ్రద్ధ పెట్టేలా చూడాలన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో తనిఖీ చేసిన అదనపు కలెక్టర్లు

జడ్చర్ల మండలంలోని పలు గురుకుల పాఠశాలలను అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ శుక్రవారం తనిఖీ చేశారు. జడ్చర్ల పట్టణంలోని మైనారిటీ బాలికలు, బాలుర, కల్వకుర్తి రోడ్డులో ఉన్న ఊర్కొండ సాంఘిక సంక్షేమ, ఆలూరు రోడ్డులోని నవాబ్‌పేట, చిట్టబోయిన్‌పల్లి బాలికల, పోచమ్మగడ్డ తండా వద్ద ఉన్న బాలానగర్ గిరిజన బాలుర, మల్లెబోయిన్‌పల్లి వద్ద ఉన్న మినీ గిరిజన, కోడ్గల్‌లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. పారిశుధ్యం, టాయిలెట్స్, తాగునీరు, భోజనం సరిగా ఉన్నాయా? అని పరిశీలించారు. బాలానగర్ మండల కేంద్రంలోని జనరల్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, ఏకలవ్య మోడల్ పాఠశాలలను అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ తనిఖీ చేశారు. భోజనశాల, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. ఎప్పటి కూరగాయలు అప్పుడే వండాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు
ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

సీఎం ఎందుకు స్పందించడం లేదు

- జూరాల ప్రాజెక్టును రేవంత్‌రెడ్డి సందర్శించాలి
- గేట్ల మరమ్మతు విషయంలో వాస్తవాలను కప్పిపుచ్చుతున్న మంత్రులు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

6

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో శైలేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 13 జడ్పీటీసీ, 136 ఎంపీటీసీ స్థానాల ఎన్నికల నిర్వహణకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది, సమస్యాత్మక కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. గతంలో 140 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, మద్దూరు మునిసిపాలిటీ కావడంతో 136కు తగ్గాయన్నారు. గత సర్పంచి ఎన్నికల్లో జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు ఉండగా, ప్రస్తుతం మద్దూరు మునిసిపాలిటీగా ఏర్పడటంతో వాటి సంఖ్య 273కు తగ్గిందని డీపీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల నిబంధనలు, నామినేషన్ల ప్రక్రియ, పరిశీలన, ఉపసంహరణ గురించి ట్రైనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సమీపంలోని దత్త బృందావన్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్‌డీవో మొగులప్ప, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజలందరికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ **శ్రీమతి వందన కె రాథోడ్,** భర్త యోగేష్ పటేల్, 31 సంవత్సరాలు, ఉద్యోగి, నివాసిత ఇ.నం.16-2-648/3/1, ఎక్సలెన్స్ అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నం.307, జడ్జి కాలనీ, బిబి క్యాన్సర్ హాస్పిటల్, మలక్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ వారు **తెలంగాణ, వనపర్తి జిల్లా, ఘన్‌పూర్ మండలం, సలకలాపురం** వద్ద గల సర్వే నం.లు **93/AA2/1/2/1, 93/A2/2/1, 93/A/2/1, 21/AA/2/1, 93/AA/1 లో మొత్తం విస్తీర్ణం ఎ.05.04 గుంటల వ్యవసాయ భూములను** చట్టబద్ధ యజమానులు అయినా (1) **శ్రీ ఎ.లక్ష్మయ్య,** తండ్రి నారాయణ, 34 సంవత్సరాలు, (2) **శ్రీ ఎ.రాంప్రసాద్,** తండ్రి ఎ. నారాయణ, 42 సంవత్సరాలు, (3) **శ్రీ ఏము రాజు,** తండ్రి ఏము నారాయణ, 44 సంవత్సరాలు, (4) **శ్రీ ఎ.నారాయణ,** తండ్రి ఎ.చిన్న చెన్నయ్య, 65 సంవత్సరాలు, (5) **శ్రీ ఎ.మాణెమ్మ** భర్త ఏము నారాయణ, 62 సంవత్సరాలు వీరందరి నివాసం ఇ.నం 2-21/1, అప్పారెడ్డిపల్లి గ్రామం, ఘన్‌పూర్ మండలం, వనపర్తి జిల్లా, తెలంగాణ-509380ల నుండి కొనుగోలు చేయడానికి **తేది 03.05.2025న అమ్మకపు ఒప్పందం** కుదుర్చుకున్నారు. విస్తీర్ణం మరియు సరిహద్దులు షెడ్యూల్‌లో మరింత వివరంగా వివరించబడినది.

పైన పేర్కొన్న సదరు ఆస్తికి సంబంధించి ఎవరికైనా ఏవైనా క్లెయిమ్‌లు, హక్కులు లేదా ఆసక్తి ఉన్నచో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 10 రోజుల్లోపు సంబంధిత ఒరిజినల్ డాక్యుమెంట్లతో దిగువ సంతకందారును సంప్రదించగలరు లేదా నా క్లయింట్ అమ్మకపు లావాదేవీని కొనసాగించి ఆస్తిని ఆమె పేరు మీద నమోదు చేయించుకుంటారు. ఆ తర్వాత వచ్చే ఏవైనా క్లెయిమ్‌లకు నా క్లయింట్ బాధ్యత వహించరు మరియు అలా ఎవరైనా చేసినచో దాని ఖర్చులు మరియు పరిణామాలకు పూర్తిగా బాధ్యత వహిస్తారు.

షెడ్యూల్ ఆస్తులు

క్ర. సం	సర్వే నం.	విస్తీర్ణం (ఎకరాలు)	ఉత్తరం	దక్షిణం	తూర్పు	పశ్చిమం
1.	93/AA2/1/2/1	01.00	సర్వే నం.92లో టి.బుచ్చిరెడ్డి వ్యవసాయ భూమి	సర్వే నం.9లో వి.మల్లయ్య వ్యవసాయ భూమి	ఎ.మాణెమ్మ వ్యవసాయ భూమి	ఎ.నారాయణ వ్యవసాయ భూమి
2.	93/AA2/2/1	01.00	సర్వే నం.92లో టి.బుచ్చిరెడ్డి వ్యవసాయ భూమి	సర్వే నం.9లో వి.మల్లయ్య వ్యవసాయ భూమి	ఎ.మాణెమ్మ వ్యవసాయ భూమి	ఎ.నారాయణ వ్యవసాయ భూమి
3.	93/A/2/1	01.00	సర్వే నం.92లో టి.బుచ్చిరెడ్డి వ్యవసాయ భూమి	సర్వే నం.9లో వి.మల్లయ్య వ్యవసాయ భూమి	ఎ.మాణెమ్మ వ్యవసాయ భూమి	ఎ.నారాయణ వ్యవసాయ భూమి
4.	21/AA/2/1	01.01	సర్వే నం.21లో టి.లక్ష్మి వ్యవసాయ భూమి	సర్వే నం.10లో హరిజన్ ఉత్తయ్య వ్యవసాయ భూమి	ఏము రాజు వ్యవసాయ భూమి	సర్వే నం.20 మరియు మార్గం
5.	93/AA/1/1/1	01.03	సర్వే నం.92లో టి.బుచ్చిరెడ్డి వ్యవసాయ భూమి	సర్వే నం.9లో వి.మల్లయ్య వ్యవసాయ భూమి	వి.సువర్ణ వ్యవసాయ భూమి	ఎ.రాజు వ్యవసాయ భూమి

సం/-ఎ.వి.సాయిరాం, అడ్వకేట్
ప్లాట్ 53, 1వ అంతస్తు, శివాని ప్లాజా, రోడ్ నం.9, భావన కాలనీ, న్యూ బోయిన్‌పల్లి, సికింద్రాబాద్-500011, మొబైల్ నం.9966044405

గాయపడిన పాముకు చికిత్స


చికిత్స చేస్తున్న వెటర్నరీ డాక్టర్ హరీశ్

అచ్చంపేటటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ సమీపంలోని లింగోటం గ్రామంలో ఓ నాటుకోళ్ల షెడ్డులో పాము కనిపించింది. దీంతో స్థానికులు స్నేక్ క్యాచర్ సుమన్ సమాచారం అందించారు. ఆయన అక్కడకు చేరుకుని పామును పట్టుకున్నారు. అప్పటికే పాముకు గాయాలు కావడంతో పట్టణంలోని వెటర్నరీ డాక్టర్ హరీష్‌కు సమాచారం ఇచ్చారు. పాముకు చికిత్స అందించిన అనంతరం అడవిలో వదిలారు. స్నేక్ క్యాచర్ సుమన్ మాట్లాడుతూ.. పాములు కనిపిస్తే తనకు సమాచారం అందిచాలన్నారు. వాటిని చంపవద్దని మనలాగే వాటికి ప్రాణం ఉంటుందని తెలిపారు.

భారీ కొండచిలువ పట్టివేత


కొండచిలువను చూపిస్తున్న సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు

పెద్దమందడి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని మోజర్ల శివారులో శంకర్ సముద్రం రిజర్వాయర్ ఎడవ కాలువ 19వ ప్యాకేజి బ్రిడ్జి మరమ్మతు పనుల కొనసాగుతున్నాయి. బ్రిడ్జి కింద ఉండి పందులు ఏర్పాటు చేసుకున్న పెద్ద రంధ్రంలో శుక్రవారం కొండచిలువను చూసిన కూలీ రామస్వామి అక్కడే ఉన్న ఇరిగేషన్ ఏఈ రమేష్, కాంట్రాక్టర్ ధనుంజయ్‌కు తెలిపాడు. వారు సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణ సాగర్‌కు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం మోజర్ల గ్రామానికి చేరుకొని బ్రిడ్జి కింద ఉన్న కొండచిలువను చూసి బయటికి తీయడం అసాధ్యమని భావించి హిటాచి మిషన్ సహాయంతో గుంత తీసి 11 అడుగుల కొండచిలువను బంధించి బయటకు తీశారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ పదేళ్ల నుంచి వనపర్తి జిల్లాలో అడవి జంతువులు, పక్షుల వృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామాల్లో పుష్కలంగా నీళ్లు రావడంతోనే అడవి జంతువుల సంఖ్య పెరిగిందన్నారు.

ధ్యానంతో పరిపూర్ణ ఆరోగ్యం

» జోనల్ కో ఆర్డినేటర్ కృష్ణారావు


మాట్లాడుతున్న జోనల్ కో ఆర్డినేటర్ కృష్ణారావు

పాలమూరు యూనివర్సిటీ , జూలై 4 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జోనల్ కో ఆర్డినేటర్ కృష్ణారావు తెలిపారు. శుక్రవారం పీయూలోని ఫార్మసీ ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ సెల్, కన్హా శాంతివనం ఇన్‌స్టిట్యూషన్ సంయుక్తంగా రెండో రోజు హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ధ్యానం ద్వారా మనస్సు క్రమబద్దీరించబడుతుందని, మానసిక పరివర్తన తీసుకురావడంలో ముఖ్యపాత్ర వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, కన్వీనర్ చంద్రకిరణ్, కో కన్వీనర్ ప్రవీణ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో శుభ్రత పాటించాలి

» డీఎంహెచ్‌వో వెంకటదాసు


పాలెంలో హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటదాసు

బిజినేపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహాల్లో శుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో వెంకటదాసు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం ప్రభుత్వ ఎస్సీ, బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహాలను శుక్రవారం తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వానాకాలం సీజనల్ వ్యాధులు రాకుండా చేతులు, కాళ్లు సబ్బుతో శుభ్రపర్చుకోవాలని సూచించారు. వంటగది, విద్యార్థుల వసతి పరిశీలించి దోమలు, ఈగలు రాకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారని, ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తెలపాలన్నారు.

ఐదు మటన్ దుకాణాలు సీజ్


మటన్ షాపునకు తాళం వేస్తున్న మునిసిపల్ సిబ్బంది

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పలు మటన్ దుకాణాలను మునిసిపల్ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం ఉదయం కమిషనర్ నాగిరెడ్డి వార్డు పర్యటనలో హౌసింగ్ బోర్డుకాలనీలోని పలు వీధులు పరిశీలించారు. ప్రధాన రోడ్డుపై నిర్వహిస్తున్న మటన్ దుకాణాల వద్ద ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా ఆరుబయట మాంసం విక్రయిస్తూ జంతు వ్యర్థాలను డ్రైనేజీలో పారవేయడాన్ని కమిషనర్ గమనించారు. దీంతో ఐదు షాపులను ఆయన సీజ్ చేయించారు.

ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

చిన్నంబావి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని బెక్కెం గ్రామంలో శుక్రవారం గొల్ల సుంకులయ్య (60) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈయన కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, భార్య, కుమారుడు హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

బాలుడిని పనిలో పెట్టుకున్న యజమానిపై కేసు

వనపర్తి రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : బాలుడిని పనిలో పెట్టుకుని యజమానిపై కేసు నమోదైన ఘటన వనపర్తి పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పాన్‌గల్ రోడ్డులో ఓ ఎలక్ట్రికల్ షాప్‌లో పని చేస్తున్న బాలుడిని లేబర్ ఆఫీసర్ రఫీ గుర్తించారు. దీంతో షాప్ యజమానిపై లేబర్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెరువుల్లోకి చేరని చేపలు

» చేప పిల్లల పంపిణీపై స్పష్టత కరువు
» ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రాని ఆదేశాలు
» ఆశగా ఎదురుచూస్తున్న మత్స్యకారులు
» నగదు బదిలీ చేయాలని డిమాండ్


నగదు బదిలీ చేయాలని పోస్టల్ ద్వారా ముఖ్యమంత్రికి లేఖ రాసి పంపిస్తున్న మత్స్యకారులు

వనపర్తి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను ఎప్పుడు వదులుతారని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగింది. ఎదిగిన చేపల విక్రయం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి చేకూరింది. ఆ తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పథకాన్ని కొనసాగించింది. అలాగే గత ఏడాది కూడా చేప పిల్లలను పంపిణీ చేసింది. చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలేందుకు ప్రతీ సంవత్సరం ఏప్రిల్ మాసంలో టెండర్ల ప్రక్రియను ప్రారంభించేది. కానీ ఈ ఏడాది జూలై నెల వచ్చినప్పటికీ ఇంకా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. టెండర్లు పిలువలేదు. దీంతో చేప పిల్లల పంపిణీపై నీలినీడలు అలుముకున్నాయి. పంపిణీ చేస్తారా? లేదా? అని మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంతో అమలుపై సందిగ్ధం నెలకొన్నది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 వేలకు పైగా చెరువులు, కుంటలు, 15 రిజర్వాయర్లు ఉన్నాయి. వాటిలో ప్రతీ ఏటా 8 కోట్లకు పైగా చేప పిల్లలను వదులుతూ వస్తున్నారు. అవి పెరిగి పెద్దయ్యాక వాటిని విక్రయించి వేలాది మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ఒక్క వనపర్తి జిల్లాలోనే 142 మత్స్యకారుల సంఘాలున్నాయి. వాటిల్లో 13,600 మంది సభ్యులున్నారు. వీరంతా చేపల విక్రయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకుంటున్న ఫలితం ఉండటం లేదు. ప్రభుత్వం నుంచి తమకు ఆదేశాలు రాలేదని చెప్తుండటంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో పంపిణీ చేయాలి

జిల్లాలో ప్రతీ సంవత్సరం అదును దాటిన తరువాత చేప పిల్లలను సెప్టెంబర్ నుంచి నవంబర్ నెల వరకు పంపిణీ చేస్తున్నారు. వాటిలో ప్రధానంగా నాలుగు రకాలైన బొచ్చ, రౌట, మోస్, బంగారు తీగలను వదులుతున్నారు. కానీ సరైన సమయంలో వదలకపోవడంతో చేప పిల్లలు ఎదగడం లేదు. దీంతో తమకు మేలు జరగడం లేదని చెప్తున్నారు. ఆగస్టులోపు చెరువుల్లో చేపలను వదిలితే బాగా ఎదుగుతాయని అంటున్నారు. అయితే కాంట్రాక్టర్లు కూడా నాసిరకం చేప పిల్లల్ని పంపిణీ చేస్తున్నారని, దీంతో అవి ఆశించిన మేర ఎదగడం లేదని ఆరోపిస్తున్నారు.

చేపలకు బదులు నగదు

ఉచితంగా చేప పిల్లలు పంపిణీకి బదులుగా సొసైటీలకు నగదు బదిలీ చేయాలని పలువురు మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. చేపలకు బదులుగా నగదు బదిలీ చేస్తే తామే నాణ్యమైన చేప పిల్లల్ని కొనుగోలు చేసి తెచ్చుకొని సరైన సమయంలో చెరువులు, కుంటల్లో వదులుకుంటామని చేప్తున్నారు. ఈ ఏడాది నుంచి అయినా నగదు బదిలీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని మత్స్యకారులు ఆశిస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



చేప పిల్లల పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తాం. ఆ వెంటనే వాటిని చెరువుల్లో వదిలేందుకు చర్యలు తీసుకుంటాం. మా దగ్గరికి వచ్చే మత్స్యకారులకు కూడా ఇదే సమాధానం చెప్పి పంపిస్తున్నాం.

- లక్ష్మప్ప,
జిల్లా మత్స్యశాఖ అధికారి, వనపర్తి

సీఎం ఎందుకు స్పందించడం లేదు?

» జూరాల ప్రాజెక్టును సందర్శించాలి
» వాస్తవాలను కప్పిపుచ్చుతున్న మంత్రులు
» అధికారులతో సమీక్షించి వివరాలు వెల్లడించాలి
» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


జూరాల ప్రాజెక్టు వద్ద తెగిన రోప్‌ను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ధరూరు/అమరచింత, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల మరమ్మతుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కనబడుతోందని, ఎనిమిది గేట్ల రోప్‌లు తెగిపోయి ప్రమాదంలో ఉంటే ముఖ్యమంత్రి ఎందుకు స్పందించడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జూరాల ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని జూరాల ప్రాజెక్టులో తెగిపోయిన క్రస్ట్ గేట్ల రోప్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు నిర్వహణ, గేట్ల వద్ద లీకేజీలు తదితర వివరాలను అక్కడికి వచ్చిన ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జుబేర్ అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. జూరాల జలాశయం సుమారు లక్ష ఎకరాలకు నీరు అందించే ప్రాజెక్టు అని, పాలకులు అనుసరించిన నిర్లక్ష్యపు విధానాలే ప్రాజెక్టు ప్రమాదంలో పడటానికి కారణమని విమర్శించారు. గేట్ల మరమ్మతుల విషయంలో వాస్తవాలను మంత్రులు, అధికారులు కప్పిపుచ్చుతున్నారన్నారు. జూరాల ప్రాజెక్టులో రోప్‌లు తెగితే ఇక్కడికి వచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసలు ఏ ప్రమాదమూ లేదని ప్రజలను మభ్యపెట్టే విధంగా మాట్లాడటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టు 8 గేట్లే కాదు 64 గేట్లు ప్రమాదంలో ఉన్నాయని తక్షణమే ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. క్రస్ట్ గేట్ల రోప్‌లను నాలుగు, ఐదు సంవత్సరాలకు ఒకసారి మార్చాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. గత ఏడాది బడ్జెట్‌లో లక్ష ఎకరాలకు నీరందించే ప్రాజెక్టుకు రూ. 17 కోట్లు కేటాయించారని, కానీ ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. ప్రాజెక్టుపై వాహనాల రాకపోకలు కొనసాగడం వల్ల భద్రతకు మరింత ముప్పు ఉన్నదని అన్నారు. ప్రత్యామ్నాయంగా బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 122 కోట్ల కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారని, గతంలో కూడా ఇలా జీవోలు విడుదల చేసినా మధ్యలోనే ఆగిపోయాయన్నారు. తక్షణమే బ్రిడ్జికి టెండర్లు వేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలంటే ప్రభుత్వం తక్షణమే రూ. 2,500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు శ్రీరామ్‌నాయక్, గద్వాల, వనపర్తి జిల్లాల నాయకులు వెంకటస్వామి, పుట్ట ఆంజనేయులు, ఎండీ జబ్బార్, ఎండీ మెహమూద్, బాల్‌రెడ్డి, గోపి, ఉప్పేరు నరసింహ, రేపల్లె దేవదాసు, పరంజ్యోతి, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

మా భూములు లాక్కోకండి

» పొలాల్లో నుంచి రోడ్డు వేయడంపై ఈజీపూర్, పోతిరెడ్డిపల్లి రైతుల గోస
» రోడ్డు అవసరం లేదని కోర్టుకు..
» రాత్రి వేళ పనులు చేస్తున్నారని ఆవేదన


కోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో తెచ్చుకున్నామంటూ చూపిస్తున్న రైతులు

కోస్గి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అవసరం లేకున్నా రోడ్డు వేస్తామని.. మా భూములను లాక్కోవడం సరికాదని, మాకు రోడ్డు వద్దని మండలంలోని ఈజీపూర్, పోతిరెడ్డిపల్లి రైతులు వాపోతున్నారు. శుక్రవారం రైతులు రోడ్డు పనులు చేపట్టవద్దని వారి పొలాల వద్ద నిరసన తెలిపారు. కోస్గి, తుంకిమెట్లరోడ్డు నుంచి పోతిరెడ్డిపల్లికి బూరుకుంట పొలాల నుంచి వెళ్లే రోడ్డు వేయవద్దని తాము హైకోర్టును ఆశ్రయించి రెవెన్యూ నక్షలో లేని రోడ్డును ఎలావేస్తారని స్టేటస్ కో తెచ్చుకున్నామని తెలిపారు. విషయం తెలుసుకున్న అధికారులు కాంట్రాక్టర్‌చే రాత్రిపూట పనులు చేయిస్తున్నారన్నారు. ఈ రోడ్డు వేయడంతో ఎవరికీ ఉపయోగం లేదని రెండు గ్రామాల ప్రజలు వద్దన్నా.. కొంత మంది బడా నాయకుల మెప్పుకోసం వేస్తున్నారని వాపోయారు. తాము పనులు చేయవద్దని వాహనాలను ఆపితే పంచాయతీరాజ్ అధికారులు బెదిరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలను పాటిస్తు రైతులకు అవసరంలేని రోడ్డు వేయవద్దని కోరారు.

అధికారులకు చెప్పినా లాభం లేదు



రోడ్డు వేయవద్దని, ఇది నక్షలో లేదని పీఆర్ ఏఈ అంజిరెడ్డికి చెప్పాం. నక్షలో ఉన్నా లేకున్నా రోడ్డువేసి తీరుతాం అని సమాధానం ఇస్తున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైందని చెబుతున్నారు. అందుకే మేము హైకోర్టుకు వెళ్లి స్టేటస్ కో తెచ్చుకున్నాం.

- దేవేందర్, రైతు

అడ్డొస్తే తొక్కేస్తరంటా..



రోడ్డు వేస్తామని ఎక్స్‌కవేటర్‌తో చదును చేసేందుకు వచ్చారు. ఇక్కడ ఎలా చదును చేస్తారని రోడ్డు వేయవద్దని అడ్డు నిలబడితే.. తొక్కుకుంటూ పోతామని అధికారులు బెదిరిస్తున్నారు. కేసులు నమోదు చేస్తామంటున్నారు. మాకు ఈ రోడ్డు అవసరం లేదు.

- బాలమణి, రైతు కోస్గి

ఎలాంటి పనులు జరగడం లేదు

కోర్టు స్టెటస్కో ఇచ్చింది వాస్తవమే. మేము ఎలాంటి పనులు చేపట్టం. కోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చాకనే పనులు చేపడతాం. మేము కోర్టుకు పూర్తిస్థాయి నివేదిక అందిస్తాం. రాత్రిపూట ఎలాంటి పనులు చేయడం లేదు.

- విలోక్, డీఈ, పంచాయతీరాజ్

ప్రజలకు రక్షణ కవచంగా పోలీసులు

» విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి
» పోలీస్ డ్యూటీ మీట్‌లో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్


బంగారు పతకాలు సాధించిన కానిస్టేబుళ్లు మధు, కిరణ్‌కుమార్‌కు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఐజీ చౌహాన్

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని జోగుళాంబ గద్వాల జోనల్ డీఐజీ ఎల్ఎస్.చౌహాన్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జోనల్ లెవల్‌లో పోలీస్ డ్యూటీ మీట్-2025 ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి గద్వాల, నారాయణపేట, వనపర్తి, మహ బూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎస్పీలు పాల్గొన్నారు. జోనల్ లెవల్‌లోని పలు విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది తమ ప్రత్యేక నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని ఒక్కొక్కరిని ప్రోత్సహిస్తూ అభినందించారు. గెలుపొందిన వారికి స్టేట్ మీట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి నేషనల్ మీట్‌లో పంపడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ అధికారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఓవరాల్‌గా చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్, మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి, నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్, వనపర్తి ఎస్పీ గిరిధర్, నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ రామేశ్వర్, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, నారాయణ పేట అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, డీసీఆర్ బీడీఎస్పీ సత్యనారాయణ, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్, వివిధ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్

» రెండున్నర గంటల పాటు ఆగిన పలు రైళ్ల రాకపోకలు
» ప్రయాణికులకు తప్పని తిప్పలు


బోయపల్లి గేట్ వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

మహబూబ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గూడ్స్‌రైలు పట్టాలు తప్పింది.. దాదాపు రెండున్నర గంటల పాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రామగుండం నుంచి తమిళనాడుకు ఎరువుల లోడ్‌తో వెళుతున్న గూడ్స్ రైలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బోయపల్లి రైల్వే గేట్ దగ్గర పట్టాలు తప్పింది. గూడ్స్‌లోని ఒక బోగి పట్టాలు తప్పడంతో రైలు నిలిచిపోయింది. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. దీంతో రైల్వే అధికారులు, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు. ఈ మరమ్మతులకు దాదాపు 3 - 4 గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. ఆ తర్వాత రైళ్ల రాకపోకలను పునరుద్ధరిస్తామని అధికారులు వెల్లడించారు. కాగా ఈ సమయంలో వచ్చే రైళ్ల రాకపోకలన్నీ నిలిచిపోయాయి. చెన్నై ఎగ్మూర్, కర్నూల్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ, వందేభారత్, వెంకటాద్రి వంటి రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. దీంతో ఆయా రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది. కొన్ని స్టేషన్లలో రైలు టికెట్ డబ్బులు వాపస్ ఇస్తే బస్సుల్లో వెళతామని ప్రయాణికులు ప్రశ్నించారు. ముఖ్యంగా తిరుపతికి వెళ్ళే రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులలో అసహనం వ్యక్తమైంది.

వైభవంగా ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

» అంబాత్రయ క్షేత్రంలో పూజలు, యజ్ఞాలు, అభిషేకాలు
» ముగింపు కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన భక్తులు


అంబాత్రయ క్షేత్రంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న స్వామి ఆదిపరాశ్రీ

ఊట్కూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని బిజ్వార్ గ్రామ అంబాత్రయ క్షేత్రంలో 9 రోజుల నుంచి నిర్వహిస్తున్న పంచముఖి వారాహి మాత నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం పూర్ణ హుతి కార్యక్రమంతో ముగిశాయి. అంబాత్రయ క్షేత్రంలో తొలిసారిగా పంచ ముఖి వారాహిమాత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో స్వామి ఆదిపరాశ్రీ మాట్లాడుతూ తొమ్మిది రోజుల నుంచి నవరాత్రి ఉత్సవాల్లో పూజలు, యజ్ఞాలు, అభిషేక కార్యక్రమాలతో పాటు 18 మంది ఆచారులచేత జపము, దర్పణం, 18 వేల వారాహి మాత మూల మంత్రం అవనం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

ఈ నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకున్న వారికి సర్వశత్రువు, సర్వబాధల, సర్వరోగ నివారణలతో పాటు సర్వ సం పదాలు కూడా సిద్ధిస్తామని తెలిపారు.

సాగు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలి

» మంత్రి జూపల్లిని కోరిన రైతులు


మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానించిన నాయకులు, రైతులు

పెద్దకొత్తపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సాగు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని కోరుతూ సాతాపూర్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ చెందిన కొంతమంది రైతులకు కొత్తపేట శివారులోని తుంగరేగుల ఏరియా సర్వే నెంబరు 167, 177లో కొంత భూమి సాగులో ఉండగా, మధ్యలో కొంతమంది దళారులు డబ్బుల కోసం 2016లో అక్రమంగా వేరే వ్యక్తులకు పట్టాలు చేసి రైతులకు అన్యాయం చేశారని మంత్రితో మొర పెట్టుకున్నారు. అక్రమ పట్టాలను రద్దు చేసి అర్హులైన సాగుదారులకు పట్టాలు ఇప్పించాలని వారు కోరారు. అనంతరం మంత్రి నాయకులు, రైతులు సన్మానించారు. కార్యక్రమంలో నారాయణరావు, వడ్డె వెంకటయ్య, కోల సత్యనారాయణ, దుబ్బ వెంకటస్వామి, విష్ణు, పరమేశ్, రాముడు, విష్ణు, రాముడు, సాయిలు, రైతులు పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖర్గే, చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య

- యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం
- మాజీ సీఎం రోశయ్య 92వ జయంతి సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం
- చాగంటికి సత్కారంతో పాటు ప్రశంసా పత్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్/రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చాగంటి మాట్లాడుతూ.. రోశయ్య గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నైలో ప్రవచనాలు చెప్పేందుకు వెళ్లినప్పుడు రాజ్‌భవన్ నుంచి బయటొకొచ్చి మరీ ఆయన స్వాగతం పలికారని గుర్తు చేసుకున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎప్పుడూ అందరికీ ఆదర్శ నాయకత్వాన్ని అందించే లక్ష్యంతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఆదర్శ రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల అప్పులు చేయకుండా ఉన్న దాంట్లో నిధులు సర్దుబాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నేత రోశయ్య అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి నిర్వహించడం అభినందనీయమని.. ఆయన వాగ్ధాటి, ఛలోక్తులను ఎవరూ మర్చిపోరని చెప్పారు. రోశయ్య ఆలోచనలు, ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలను పార్టీలకతీతంగా ఇప్పుడు అనుసరించాల్సిన అవసరముందని గుత్తా అన్నారు. ఇటు డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అదనపు డీజీపీ మహేశ్ భగవత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. లక్డీకాపూల్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

గ్రూపులు కడతామంటే.. భయపడం!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీల ఉమ్మడి, విస్తృత కార్యవర్గ సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

తెలంగాణ.. కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్!

తెలంగాణను కాంగ్రెస్ మోడల్ స్టేట్‌గా దేశానికి చూపనున్నట్టు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ సైద్ధాంతాలకు అనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా హామీలను సమర్థంగా అమలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేతలు పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ సమావేశంలో చెప్పారు. ఇక రేవంత్ మంత్రివర్గంలో పనిచేయాలన్నది తన కోరికని, జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చెప్పారు.

మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి!

మంత్రులు, ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి పంపాలని మంత్రులు, పీసీసీ చీఫ్‌ను నాలుగు నెలలుగా కోరుతున్నా.. స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి ఉంటే.. నామినేటెడ్ పోస్టుల్లో ఒక టర్మ్ అవకాశాలు పూర్తయ్యేవని వివరించారు.

నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ:ఖర్గే

జూలై నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మంత్రులు, టీపీసీసీ చీఫ్‌కు ఖర్గే స్పష్టం చేశారు. దీన్ని సమన్వయం చేసుకునే బాధ్యత పీసీసీ చీఫ్‌దేనని.. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకే పదవులు ఇవ్వాలని సూచించారు. 'ప్రభుత్వంపై పార్టీ ఫిర్యాదు చేయడం చూశాం గానీ, పార్టీపై ప్రభుత్వం ఫిర్యాదు చేయడం ఇక్కడే చూస్తున్నా' అని ఖర్గే వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు ఖర్గే సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, కాపాడుకోవాలని చెప్పారు.



గాంధీభవన్ చేరుకున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్

పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దు: సీఎం

నేతలు పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దని సీఎం రేవంత్ సూచించారు. పార్టీ పదవులతో గుర్తింపు, గౌరవం దక్కుతాయని, రాజకీయాల్లో ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరుగుతాయని, ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని కోరారు. అందరూ కష్టపడి పనిచేసి.. కాంగ్రెస్‌ను రెండో సారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ధీమావ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూసామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం చేద్దాం?

ఈ నెల 7న క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ

తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ జూలై 7న గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఆధారాలు చూపకుండా అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యే అయినందున.. అనిరుధ్‌రెడ్డికి క్రమశిక్షణా చర్యల కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేస్తుందా లేక చర్యల కోసం ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీకి సిఫార్సు చేస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే గాంధీభవన్‌లో ఛైర్మన్ మల్లురవి అధ్యక్షతన క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతల వివాదంపై పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయం సేకరించింది. అనంతరం మీడియాతో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కమిటీ పెద్దలు తనతో మాట్లాడారన్నారు. చిన్న చిన్న బేధాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని చెప్పారు.

డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రాత్మక మైలురాయి

- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్/సైదాబాద్/యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో రాష్ట్ర జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. చంచల్‌గూడ జైలులో నివృత్తి డీ అడిక్షన్ సెంటర్‌ను శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఖైదీలు మత్తు వ్యసనాన్ని అధిగమించి వారి జీవితాలను పునర్నించడానికి సహాయపడే వాతావరణం చంచల్‌గూడ జైలులో ఉందని ప్రశంసించారు. కాగా, అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్నిన్యాయమూర్తికి అందజేశారు. కాగా, బాలల హక్కుల రక్షణ అంశంపై 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్' అనే పేరుతో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి స్టేక్ హోల్డర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, హై కోర్ట్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు.



జస్టిస్ సూర్యకాంత్‌కు నృసింహుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, ఆర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, ఆనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని తెస్తూ.. ఈఏడాది మార్చి 3న కెంపేగౌడ విమానాశ్రయంలో రన్యారావ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో రన్యారావ్, రాజు, సాహిల్‌జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురూ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు!

గద్వాల/దోమలపెంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. శుక్రవారం కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రిడ్జిలు, సొరంగాలున్న హైవేలపై టోల్ చార్జీలు సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 4: జాతీయ రహదారులపై సొరంగాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు లేదా ఎలివేటెడ్ హైవేలు వంటి నిర్మాణాలున్న భాగాలకు టోల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం 50శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ టోల్ చార్జీలను లెక్కించడానికి కొత్త పద్ధతి/ఫార్ములాను నోటిఫై చేస్తూ ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండే ప్రతి కిలో మీటరు వంతెనలు లేదా సొరంగాలకు వాహనదారులు సాధారణ టోల్ కన్నా పది రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీన్ని సవరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సొరంగాలున్న ప్రాంతాల్లో టోల్ రేటును 50 శాతం వరకు తగ్గించినట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

క్రైం కార్నర్

మట్టి దిబ్బ కూలి వ్యక్తి దుర్మరణం

- పైపులైన్ పనులు చేస్తుండగా ఘటన

వీపనగండ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పైపులైన్ పనుల కోసం తీసిన కాలువ మట్టి మీదపడి వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం బోగేనిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ గోవిందమ్మ దంపతులు మండల కేంద్రానికి చెందిన బాబుజీగౌడ్ వద్ద రెండు సంవత్సరాల నుంచి పని చేస్తున్నారు. బాబుజీగౌడ్ ఉదయం తన వ్యవసాయ బావిలోకి భీమా కాల్వ నుంచి పైపులైన్ పనులను ఎక్స్‌కవేటర్‌తో చేపట్టారు. ఈ క్రమంలో పైపులైన్ కోసం కట్టపై తీసిన కాలువలో వెంకటేష్ ఉండగా మట్టి జారి అతనిపై పడటంతో పూర్తిగా కూరుకుపోయాడు. గమనించిన చుట్టు పక్కల వారు మట్టి తొలగించి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పెద్దదిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాణి తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ఊర్కొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపు తప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దార జంగయ్య తన బైకు చెడిపోవడంతో కల్వకుర్తికి మరో బైకును తాడుతో కట్టుకొని తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో బైకు అదుపు తప్పి కిందపడటంతో దార జంగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైనా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కల్వకుర్తి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్లికట్ట చెందిన బి.సత్యనారి మ ద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. శనివారం ఆయన్ని కోర్టులో హాజరుపర్చగా ఒక రోజు జైలు శిక్ష, రూ.600 జరిమానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వెల్దండ: కల్వకుర్తి మండలం బెక్కెరకు చెందిన దార రామకృష్ణ ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకుని కేసునమోదు చేశారు. శుక్రవారం కల్వకుర్తి కోర్టులో ప్రవేశపెట్టగా మూడు రోజుల జైలు శిక్ష, రూ.600 జరిమానా విధించినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

తాడూరు: మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో నాగర్‌కర్నూల్ బీసీ కాలనీకి చెందిన వెంకటయ్య మద్యం తాగినట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. ఆయనను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కోర్టులో ప్రవేశపెట్టగా ఒక రోజు జైలు శిక్ష, లేదంటే రూ.10వేల జరిమానా కట్టాలంటూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు.

ఆగి ఉన్న లారీలో 200 లీటర్ల డీజిల్ చోరీ

చారకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీలో 200 లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకొంది. డ్రైవర్ భీమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తలకొండపల్లిలో న్యాచురల్ బీచ్ కంపెనీ నుంచి రాయి పౌడర్ తీసుకొని చెన్నై బయలుదేరారు. గురువారం రాత్రి 12 గంటల సమయంలో నిద్ర రావడంతో చారకొండ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి పక్కన లారీ ఆపి పడుకున్నట్లు తెలిపారు. 2.30 గంటల సమయంలో లేచి లారీ స్టార్ట్ చేయడంతో డీజిల్ అయిపోయినట్లు సిగ్నల్ చూపించడంతో వెంటనే ట్యాంకును పరిశీలించాడు. ట్యాంకు తాళం పగులగొట్టి కిందపడి ఉంది. ట్యాంకులో డీజిల్ లేదని డ్రైవర్ భీమేష్ తెలిపారు.

పశువుల కాపరికి చదువుపై శ్రద్ధ అమోఘం

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
- పీహెచ్‌డీ సాధించిన పరమేష్‌కు అభినందన

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పశువులు మేపుతూ చదువుపై ఉన్న మమకారంతో పరమేష్ పీహెచ్‌డీ సాధించడం అమోఘమని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ కొనియాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం కొండనాగుల గ్రామానికి చెందిన పరమేష్ బాల కార్మికుడిగా ఉంటూ 14 ఏళ్ల వయస్సులో బ్రిడ్జి కోర్సు పద్ధతిలో నేరుగా ఏడవ తరగతిలో చేరి విద్యాభ్యాసం పూర్తి చేశాడు. నేడు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందాడు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన పరమేష్‌ను కలెక్టర్ శాలువా సన్మానించి అభినందించారు. పశువుల కాపరి నుంచి పీహెచ్‌డీ సాధించే వరకు తన ఎదుగుదలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చదువుకు దూరంగా ఉంటూ చదవలేకపోతున్నామని యువతకు పరమేష్ స్ఫూర్తిగా నిలిచాడని పేర్కొన్నారు.



పరమేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

గ్రామస్థుల ఆధ్వర్యంలో..

బల్మూరు: పరమేశ్‌ను, తల్లిదండ్రులను కొండనాగుల గ్రామస్థులు, పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొండనాగుల గ్రామాన్ని పేరు తీసుకురావడంతో గర్వపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యావంతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి పశువుల పాక దగ్ధం

- రెండు కాడెద్దులు, 30 నాటు కోళ్లు సజీవ దహనం

ఊట్కూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి మంటలు అంటుకుని పశువుల పాక దగ్ధం కాగా, కాడెద్దులు, నాటు కోళ్లు సజీవ దహనమైన ఘటన శుక్రవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్ల శివారులో చోటు చేసుకుంది. రైతు లచ్చన్న, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపొర్లకు చెందిన రైతు పాపలి లచ్చన్నకు ఊట్కూర్‌కు వెళ్లే రోడ్డువైపు పొలం ఉన్నది. పశువుల పాకను ఏర్పాటు చేసి నాటుకోళ్లు, పావురాలను పెంచడంతో పాటు ఎద్దులను అక్కడే ఉంచి పొలం పనులు చేసుకుంటాడు. గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పశువులను పాకలో కట్టివేసి గ్రామానికి వచ్చాడు. తిరిగి ఉదయం ఎద్దులను బయటికి వెళ్లడానికి పొలానికి వెళ్లగా, అప్పటికే పాక దగ్ధమై అందులో రెండు కాడెద్దులు, 30 నాటు కోళ్లు సజీవదహనం కాగా పావురాలు మాత్రం ప్రాణాలతో బయటపడ్డాయి. పాకలో ఉంచిన ద్విచక్రవాహనంతో పాటు 38 యూరియా బస్తాలు, 50 కేజీల బియ్యం, వ్యవసాయ సరికరాలు, ఇనుప రేకులు కాలిపోయాయి. పాక బయట ఉంచిన రెండు ట్రాక్టర్ల గడ్డి వాము సైతం బూడిదైంది. పాక చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతోనే పశువులు సజీవదహనం అయ్యాయి. అంతేకాక బైక్‌కు సైతం మంటలు అంటుకోవడంతో పెట్రోల్ ట్యాంక్ పేలి ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రమాదంతో రూ.3.5లక్షల ఆస్తి నష్టం జరిగింది. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

వంగూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలిఇ రంగాపూర్‌లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ మహేష్‌గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన వాస సాయిబాబు షాపులో 13 బస్తాల దొడ్డు బియ్యం, 26 బస్తాల సన్న పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసుకున్నట్లు తెలిపారు. పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన ఆశీర్వాద్‌తో ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన మహేశ్వరితో వివాహమైంది. ఈమె ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎట్టకేలకు..

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఎగువ ప్రాంతాలు నల్లరేగడి భూములు కలిగి ఉండటంతో ఒండ్రు ఎక్కువగా వస్తుంది. అయితే తుంగభద్ర ఎగువ పరివాహకంలో ఎర్రనేలలు ఉండటంతో సుంకేశుల వద్ద ప్రతీఏటా ఇసుక మేటలు పేరుకుపోతుంటాయి. గతంలో సాధారణ పద్ధతిలో ఇక్కడ ఇసుక తవ్వకాలు చేసేవారు. కానీ నీటినిల్వ కారణంగా కష్టతరంగా మారుతోంది. 2019లో ఇక్కడ ఇసుక తవ్వకాలకు టెండర్ దక్కించుకున్నవారు ఇప్పటికీ దాన్ని తోడలేకపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

తరచూ గొడవలు..

తుంగభద్ర నది రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉంది. రాష్ట్రం ఏర్పడేదాక ఇక్కడ ఇసుక తవ్వకాలకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కానీ స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇసుక విషయంలో వివాదాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారులు నదిని కూడా విభజించారు. నది రెండు రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న కారణంగా చెరో సగం అని నిర్ణయించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఏదో ఒక సందర్భంలో ఇసుక తవ్వకాల్లో పేచీలు నడుస్తూనే ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఇసుక అవసరాలకు తుంగభద్ర మాత్రమే వనరుగా ఉండగా అక్కడా వివాదాలు ఉండటంతో కొరత ఏర్పడుతోంది. అలాగే ఇటువైపు నుంచి ఇసుక ట్రాక్టర్లు కొంచెం అటువైపు వెళ్లినా అటువైపు నుంచి ఇటువైపునకు వచ్చినా పెద్ద తలనొప్పిగా మారుతోంది. ఏపీ దాదాపు నాలుగేళ్ల నుంచి డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుక తవ్వుతుండగా రాత్రి సమయాల్లో నదిలో తెలంగాణ బార్డర్ వైపునకు వచ్చి ఇసుకను తోడుకెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి నుంచి కూడా ఇటువైపునా అదే పద్ధతిని ప్రారంభించాలనే డిమాండ్లు వ్యక్తమయ్యాయి. కానీ అమల్లోకి రాలేదు. తాజాగా అనుమతి రావడంతో ఇసుక కొరత తీరడంతో పాటు వివాదాలకు తావుండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వచ్చే సంవత్సరం జూన్ 21 వరకు జితిన్ మినరల్స్ ద్వారా ఇసుకను తోడనుండగా టీఎస్ఎండీసీ ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్నవారికి వెంటనే లభించి నిర్మాణాలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

తెలకపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జూన్ 22న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. అథ్లెటిక్స్ ఎంపికల్లో తెలకపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆలేరుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు 7వ తరగతి చదువుతున్న మధు ప్రియ అండర్-14 విభాగంలో (ట్రైయాతలిన్ గ్రూప్-సీ), మహాలక్ష్మి అండర్-12 విభాగంలో 60 మీటర్ల పరుగుపందెంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 6న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం నరహరి, ఫిజికల్ డైరక్టర్ బాలయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉండవల్లి నుంచి ముగ్గురు..

ఉండవల్లి: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలానికి చెందిన ముగ్గురు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎలిజబెత్ సుహాసిని, డైరెక్టర్ రాధా తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వారిని అభినందించారు. టీజీఎంఆర్ఎస్జేపీ గర్ల్స్-1 అలంపూర్ పాఠశాల నుంచి సమీరా, వసంత, జానకి ఈనెల 6వ తేదీన నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి

- డీఎఫ్ఏ అధ్యక్షుడు బండల వెంకట్రాములు

గద్వాల అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు రాణించాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలో జూనియర్ బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలకు అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరచి రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఆ దిశగా కోచ్‌లు క్రీడాకారులు తయారు చేయాలన్నారు. ఈ పోటీలకు 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ప్రతిభ కనబరచిన 18 మందిని ఎంపిక చేసి, ఈ నెల 9 నుంచి 15వ ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో జితేందర్, సెక్రటరీ విజయ్‌కుమార్, ఆనంద్, ప్రశాంత్ గౌడ్, రాజారెడ్డి పాల్గొన్నారు.

సదా మీ సేవలో..



అచిరకాలంలోనే ఆశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

గద్వాల జిల్లా	:9985404383
మహబూబ్‌నగర్ జిల్లా	: 8096677362
నాగర్‌కర్నూల్ జిల్లా	:8374394441
నారాయణపేట జిల్లా	:9985456557
వనపర్తి జిల్లా	:9010937550

పత్రిక పంపిణీలో ఏవైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.

సర్క్యులేషన్ మేనేజర్: 9985411170

న్యూస్ బాక్స్

శాకాంబరిదేవీగా అమ్మవారు

జడ్చర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో, సంతోషి మాత ఆలయంలో అమ్మవారికి శాకాంబరి దేవీగా అలంకరించారు. పంచామృత అభిషేకం, సామూహిక కుంకుమార్చన, మహా మంగళహారితి నిర్వహించారు.

వివేకానందుడి ఆశయాలు కొనసాగిద్దాం

నవాబ్‌పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానందుడి ఆశయ సాధనకు యువత ముందుకురావాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొండాపూర్ చౌరస్తాలో వివేకనందుడి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఎంపీడీవోకు వినతి

హన్వాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో యశోదమ్మకు వినతిపత్రం అందించారు. ఈనెల 9న కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెలో పాల్గొంటామని వివరించారు. ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం నాయకులు వెంకటయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్, కల్యాణి, శివరాజు, మల్లేష్, రాజు, చెన్నయ్య పాల్గొన్నారు.

ఉల్లాస్ ఆడల్ట్ ఎడ్యుకేషన్‌తో వయోజనులకు విద్య

జడ్చర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో సెర్ప్, మెప్మా సహకారంతో వియోజనులకు విద్య అందించేందుకు ఉల్లాస్ ఆడల్ట్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎంఈవో మంజులాదేవి అన్నారు. జడ్చర్ల జడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఉల్లాస్ అడల్ట్ ఎడ్యుకేషన్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్పీ శేషసేనారెడ్డి శిక్షణ ఇచ్చారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జడ్చర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత పేర్కొన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని 27వ వార్డు, ఇందిరానగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీకి టాయిలెట్స్ మంజూరయ్యాయని, సరైన స్థలంలో నిర్మించాలన్నారు. కౌన్సిలర్ రాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

హన్వాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని తహసీల్దార్ కిష్ట్యానాయక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పోలీసులు శుక్రవారం హన్వాడలో నిర్వహించగా, తహసీల్దార్ పాల్గొని హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు.

● నవాబ్‌పేట : ప్రతీ ఒక్కరు రహదారి నియమాలు పాటించి ప్రమాదాలు నివారించాలని నవాబ్‌పేట ఏఎస్‌ఐ జనార్దన్ పిలుపునిచ్చారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మరికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తాం

దేవరకద్ర, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కౌకుంట్ల మండలం పేరూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

జడ్చర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం పోలేపల్లి బస్టాండ్‌లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందాడు. జడ్చర్ల సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. పోలేపల్లి గ్రామంలో భిక్షాటన చేసుకునే వ్యక్తిగా తెలిసిందని, మధ్యాహ్నా సమయంలో బస్టాపు ఆవరణలో సేద తీరేందుకు వచ్చి, అక్కడే మృతి చెందినట్లు తెలిసిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పనులు పూర్తి చేయాలి

గండీడ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో డైనింగ్ హాల్‌ను పనులను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సంజీవ్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఇన్‌చార్జి ఎంపీడీవో హరీష్‌చంద్రరెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం జనార్ధన్ పాల్గొన్నారు.

ఉర్సు పోస్టర్ విడుదల

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రామయ్యబౌలీలో గల హజ్రత్ షేక్ రఫియోద్దీన్ షా ఖాద్రీ దర్గా, షేక్ అబ్దుల్ రహెమాన్ హుస్సేన్ షర్ఫీ ఉర్సు ఈనెల 15న నిర్వహించనున్నారు. శుక్రవారం జామీయ మసీదు ఆవరణలో హైదరాబాద్ జామీయ నిజామియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సయ్యద్ సఫీుర్ అహ్మద్ ఉర్సు పోస్టర్లను ఆవిష్కరించారు. నిర్వాహకులు షేక్ బుర్హాన్ ఖాద్రీ షర్ఫీ, సైఫ్ ఖాద్రీ మాట్లాడుతూ 15న రాత్రి 7 గంటలకు గంధోత్సవం ఉంటుందని, దర్గా చాదర్ సమర్పించి యాదే హుస్సేన్ ధార్మిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దర్గా ముతవల్లి షేక్ సైఫోద్దీన్‌ఖాద్రీ, అబ్దుల్‌ఖాదర్‌షరీఫ్, అబ్దుల్‌జకీ, జహంగీర్‌పాషా ఖాద్రీ, అబ్దుల్లా, సుల్తాన్, ఫర్వేజ్ పాల్గొన్నారు.

అద్దె భవనంలో అన్నీ కష్టాలే!

» సర్వీస్ రోడ్డు పక్కనే తహసీల్దార్ కార్యాలయం » ఇబ్బందులు పడుతున్న ప్రజలు

» అటవీ శాఖ కార్యాలయంలోకి మార్చాలని కలెక్టర్ ఆదేశం



అద్దె భవనంలో కొనసాగుతున్న మహమ్మదాబాద్ తహసీల్దార్ కార్యాలయం

మహమ్మదాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత భవనాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించడంతో.. అందులో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాన్ని 15 రోజుల క్రితం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ అద్దె భవనంలోకి మార్చారు. మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం సర్వీస్ రోడ్డు పక్కనే ఉండటం, ప్రజలు, వృద్ధులు కార్యాలయంలోకి వచ్చేందుకు అనువుగా లేపోవడం, పార్కింగ్ స్థలం సైతం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అటవీశాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న భవనంలోకి మార్చాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. వర్షం వస్తే భవనం కురుస్తోందని తహసీల్దార్ తెలపడంతో అటవీ శాఖ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి, చిన్నచిన్న మరమ్మతులు చేయిస్తే సరిపోతుందన్నారు. దీంతో పలువురు ఈ అద్దె భవనం కంటే అటవీ శాఖ భవనం బాగుంటుందని, అక్కడకి తహసీల్దార్ కార్యాలయం మారిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సర్వీస్‌రోడ్డు పక్కన ఇబ్బందిగా ఉంది..



తహసీల్దార్ కార్యాలయం జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల పాత భవనంలో ఉన్న సమయంలో బాగుండేది, అద్దె భవనం సర్వీస్ రోడ్డు పక్కనే ఉండటంతో ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వ భవనంలోకి మార్చాలి.

- భిక్షపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

అటవీశాఖ భవనం రిపేర్ చేయించాలి



ప్రస్తుతం ఉన్న భవనంలో సరిపడా గదులు లేకపోవడంతో పాటు పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. అటవీశాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న భవనాన్ని రిపేర్ చేసి, తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించాలి.

- కెఎం నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకే ఎంపిక చేశాం



అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకే ఈ అద్దె భవనం ఎంపిక చేశాం. ఇక్కడ కొంత ఇబ్బంది ఉంది. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. అటవీశాఖ కార్యాలయం ఇప్పిస్తే అక్కడికి మార్చుతాం.

- విద్యాసాగర్‌రెడ్డి, తహసీల్దార్

రోశయ్య సేవలు మరువలేనివి



రోశయ్య, దొడ్డి కొమురయ్య చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/జడ్చర్ల/పాలమూరు యూనివర్సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నగా వ్యవహరించిన కొనిజేటి రోశయ్య జయంతిని, తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి పూలమాల వేసి నివాళి అర్పించారు. రోశయ్య, దొడ్డి కొమురయ్య సేవలను కొనియాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహరెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి శంకరాచారి, డీఎస్‌వో శ్రీనివాస్, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్, కలెక్టరేట్ ఏవో సువర్ణరాజ్ పాల్గొన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలో రోశయ్య చిత్ర పటానికి మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక పూలమాల వేసి నివాళులు అర్పించారు. కౌన్సిలర్లు చైతన్యచౌహాన్, రఘురాంగౌడ్, రమేశ్, రహీం, రాజు, నాయకులు శ్యామ్, రాంమోహన్ పాల్గొన్నారు. రోశయ్య సేవలు మరవలేనివని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. పీయూ పరిపాలన భవనంలో రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆడిట్‌సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, పరీక్షల నియంత్రణ అధికారి ప్రవీణ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

భూత్పూర్/రాజాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ బీఎల్‌వోలకు సూచించారు. శుక్రవారం భూత్పూర్, రాజాపూర్ మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో ఏర్పాటు చేసిన బీఎల్‌వోల శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఓటరు జాబితా నిరంతర ప్రకియ అని, వాటిలో పేర్లు చేర్పులు, మార్పులు, కొత్త పేర్లను నమోదు చేసుకోవడం వంటి బీఎల్‌వోలు ప్రతీసారి పరిశీలించుకోవల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్లు కిషన్‌నాయక్, రాధాకృష్ణ, ఆర్‌ఐ యాదగిరి పాల్గొన్నారు.

మృతి చెందిన వారిని తొలగించాలి

గండీడ్ : ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి అర్హులైన వారిని నమోదు చేయాలని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర సూచించారు. శుక్రవారం మండలంలోని వెన్నాచేడ్ సాయిరాం ఫంక్షన్ హాల్‌లో బూత్ లెవల్ మరియు సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పరిగి, గండీడ్ తహసీల్దార్లు ఆనందరావు, మల్లికార్జున్ రావు, అనిల్‌కుమార్, శ్రీనివాస్, డీటీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన డీఈవో

జడ్చర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగాపురం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం జడ్చర్ల సీఐ కమలాకర్ తో కలిసి డీఈవో ప్రవీణ్‌కుమార్ మొక్కలు నాటి, నీళ్లు పోశారు. సీఎంవో బాలునాయక్, ఉపాధ్యాయుడు అనంతప్ప పాల్గొన్నారు.

విలువైన వస్తువులు వెంట తీసుకురావొద్దు

కోయిలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జాతరకు వచ్చే భక్తులు బంగారంతో పాటు విలువైన వస్తువులు వెంట తీసుకరావద్దని ఎస్‌ఐ తిరుపాజీ సూచించారు. శుక్రవారం మొహర్రం ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో బందోబస్తును పరిశీలించారు. బీబీ ఫాతిమా చావిడి వద్ద క్యూలైన్‌లో తొక్కిసలాట జరుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కోయిలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మురళీధర్‌రావు శుక్రవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులతో పాటు స్టడీ మెటీరియల్ అందజేశారు. హెచ్‌ఎం నర్సింహులు ఉన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నవాబ్‌పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడు శ్రావన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని యన్మనగండ్ల బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వార్డెన్ బందెమ్మ, బాలమ్మ, శరభలింగం, శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు సీనియర్ సిటిజన్ ఫోరం సర్వసభ్య సమావేశం

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్ ఫోరం సర్వసభ్య సమావేశం శనివారం తెలంగాణ చౌరస్తాలోని రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశ మందిరలో నిర్వహించనున్నట్లు ఫోరం అధ్యక్షుడు జరగతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో ఇంజనీరు మృతి

నవాబ్‌పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పని చేస్తున్న చోట ఓ ఇంజనీరు మృతి చెందిన సంఘటన మండలంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విక్రమ్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ జిల్లా పామిడిమక్కల మండలం మంతాడ గ్రామానికి చెందిన పూర్ణచందర్‌రావు (43) మండలంలోని కాకర్‌జాల గ్రామ సమీపంలోని మనోహర్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మెకానికల్ ఇంజనీర్‌గా అపాయింట్‌మెంట్ ఆర్డర్ పొంది, మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా శుక్రవారం తెల్లవారుజామున కంపెనీ కేటాయించిన గదిలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఈ విషయం తోటి ఉద్యోగి మనోజ్ ఫోన్ ద్వారా భార్య దీప్తికి సమాచారం ఇచ్చాడు. తన భర్త మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌ను సన్మానిస్తున్న హౌజింగ్‌బోర్డు కాలనీవాసులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హౌజింగ్‌బోర్డు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం సమరించారు. ఈ సందర్భంగా మంగళవారం కమిషనర్ కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. కాలనీ అధ్యక్షులు యాదయ్యగౌడ్, నరేందర్‌రెడ్డి, బాల్‌రాంగౌడ్, కాశన్న, సునీల్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మూసాపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం రాచాల గ్రామానికి చెందిన వరుణ్‌కుమార్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ.7 లక్షల ఎల్‌వోసీని అందజేశారు.

సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు



మిడ్జిల్ నుంచి ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్/గండీడ్/మహమ్మదాబాద్/మిడ్జిల్/రాజాపూర్/నవాబ్‌పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిర్వహించే గ్రామాధ్యక్షుల సమ్మేళనానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. నాయకులు లక్ష్మణ్‌యాదవ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, మారెపల్లి సురేందర్‌రెడ్డి, మల్లు నరసింహరెడ్డి, సిరాజ్‌ఖాద్రి, ఎన్‌పీ వెంకటేశ్, సీజె బెనహర్ పాల్గొన్నారు. గండీడ్, మహమ్మదాబాద్ మండల అధక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ ఆధ్వర్యంలో 49 గ్రామాల నుంచి బస్సుల్లో కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు. మిడ్జిల్ నుంచి మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, రాజాపూర్ నుంచి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్, నవాబ్‌పేట నుంచి మార్కెట్ చైర్మన్ హరలింగం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో సభకు తరివెళ్లారు.

7న కురుమూర్తి ఆలయంలో లక్ష పుష్పార్చన

చిన్నచింతకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7న స్వామి వారికి లక్ష పుష్పార్చన నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా లక్ష పుష్పార్చన, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, పుణ్యావచనము, అమ్మ వారికి కుంకుమార్చన, రాత్రికి అఖండ భజన నిర్వహించనున్నట్లు తెలిపారు.

అమరుడు దొడ్డి కొమురయ్య



నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

పాలమూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రాములు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఎం నాయకులు చంద్రకాంత్, రాందాసు, రాజ్‌కుమార్, గాలెన్న, సురేష్, ఆదివిష్ణు, ఖయ్యూం, భరత్, ప్రవీణ్, ఖమర్ అలీ పాల్గొన్నారు. సాయుధ పోరాటంలో తొలి అమరుడుగా దొడ్డి కొమరయ్య అమరత్వం చిరస్థాయిగా నిలుస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ఎదుట దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. కె.రాము, సత్యనారాయణరెడ్డి, ఆనంద్, నరహరి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలే లక్ష్యంగా కొత్త తరహా సైబర్ నేరాలు : ఎస్పీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పేదలనే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు కొత్త తరహ నేరాలకు పాల్పడుతున్నారని ఎస్పీ జానకి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు కేంద్రం అందించే పీఎం కిసాన్ పథకాన్ని అడ్డుపెట్టుకుని నకిలీ యాప్‌ల ద్వారా ఓటీపీ తీసుకుని రైతుల ఖాతాలోని సొమ్ము మొత్తం కాజేస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్, సీబీఐ పేరుతో వీడియో కాల్ చేసి అరెస్ట్ చేయబోతున్నట్లు బెదిరించి డబ్బులు గుంజుతున్నారని తెలిపారు. ప్రజలు తాము మోసానికి గురైనట్లు గుర్తించి గోల్డెన్ అవర్‌లో 1930 కాల్ చేసి సైబర్ నేరగాళ్ల నుంచి రక్షణ పొందాలని సూచించారు. అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే సమాచారం అందించాలన్నారు. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని సూచించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం



డాక్టర్ చంద్రకళకు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

జడ్చర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం తీసుకొచ్చిన నాగులు లేబర్ కోడ్‌లకు నిరసనగా ఈ నెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి తెలుగుసత్తయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాగి కృష్ణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళకు ఆసుపత్రి కార్మికులతో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. కార్మికులు నరసింహ, రామకృష్ణ, అలివేలు, భార్గవి, నీరజ, సుక్కమ్మ, మంగమ్మ, అలివేల పాల్గొన్నారు. అదే విధంగా గ్లాస్ అండ్ యూపీవీసీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జహంగీర్ సీఐటీయూ కార్యాలయంలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని, సమ్మెలో ప్రతీ కార్మికుడు పాల్గొనాలని కోరారు. రఘుమారెడ్డి, బాబా, సమీర్, కరీం, మ్యాథ్యూస్‌రెడ్డి, మధు, విజయ్, సర్దార్ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక క్యాంపులు

రాజాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మారుమూల తండాలో నివాసం ఉంటున్న గిరిజనుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోందని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కుత్నేపల్లి, కొర్రతండాలో గిరిజనులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు పాల్గొని దర్తి ఆబా జనభాగిదారి అభియాన్ పథకాలపై అవగాహన కల్పించారు. ఆధార్ కార్డు, ఆహార భద్రతా కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కులం ధ్రువీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్ ధన్ బ్యాంక్ అకౌంట్, ఉపకార వేతనాలు, ప్రమాద బీమా పథకాలు లేని వారి యొక్క పేర్లు గుర్తించి, వారి సేవలు అందజేయుటకు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో వెంకట్ రాములు, ఎల్‌డీఎం భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు రాధాకృష్ణ, అనురాధ, ఏపీఎం రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

మహబూబ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ మండలంలోని ఓ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రామ్మోహన్ పదో తరగతి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. అమ్మాయిలు అక్కడే ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ పాఠశాలలో చదువుకుంటున్నారు. గతంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు మందలించినా ప్రవర్తనలో మార్పు రాలేదు. వే ధింపులు మళ్లీ మొదలవడంతో విద్యార్థినులు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు షీటీంకు సమాచారం ఇవ్వగా.. విద్యార్థినులను విచారించి ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. మైనర్ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినందున రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి : యెన్నం

మహబూబ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల సమస్యలకు త్వరలో పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులతో సమావేశమయ్యారు. మౌలాలి గుట్టలో ఇది వరకే ఇళ్ల పట్టాలు కేటాయించిన 48 మందికి అలాట్ చేస్తామని, ఈ విషయమై కలెక్టర్‌తో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు. పట్టాలు పొందిన జర్నలిస్టులు కలెక్టరేట్‌లో జిరాక్స్ పత్రాలు సమర్పించాలన్నారు. కోర్టు కేసులు ఉన్న 8 మంది జర్నలిస్టులకు తొందరలోనే ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. ఇక 25 సర్వే నెంబర్‌లో ఇప్పటికే ఇంటి నిర్మాణం చేసుకున్న వారు, నిర్మాణాలు చేసుకుంటున్న వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నరేందర్‌చారి, నరేందర్‌గౌడ్, జర్నలిస్టులు రవికుమార్, విజయభాస్కర్, కిశోర్‌కుమార్, వెంకటేశ్వరరావు, తిరుపతయ్యగౌడ్, జెమిని శేఖర్, శివకుమార్, యాదయ్య, రవికుమార్, ప్రభాకర్, రామాంజనేయులు, మణిప్రసాద్, సంతోష్‌కుమార్, ఆశన్న, గోపి పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని రామయ్యబౌలి, పాతపాలమూరు కాలనీలలో పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



కాంగ్రెస్ గ్రామ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

మూసాపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కాంగ్రెస్ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని అడ్డాకుల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని బలీద్‌పల్లి, కన్మనూర్ గ్రామాల్లో ఉమ్మడి మండలాల సమన్వయ కమిటీ సభ్యులచే ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి పాల్గొని, మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ గ్రామస్థాయిలో పార్టీ అభివృద్ధికి పాటుపడాలని, కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ కమిటీలను ఎన్నికున్నారు. మూసాపేట మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, ఉమ్మడి మండలాల నాయకులు షఫీఅహ్మద్, విజయమోహన్‌రెడ్డి, నారాయణ, గోవర్ధన్, ఆజం, రాంచందర్, యాదయ్య, అంజనేయులు, సంతోషి, శకుంతమ్మ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు లలితా సహస్రనామ పారాయణం

జడ్చర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపల్లి శ్రీమలయాళ స్వామి లలితాంబిక తపోవనంలోని లలితా మహత్రిపురసుందరి దేవి, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం 9 గంటలకు లలితా సహస్ర పారాయణం నిర్వహించనున్నట్లు తపోవనం నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌కు చెందిన శ్రీలలితా విద్యా ఉపాసకురాలు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, లలితా పరివార్ వ్యవస్థాపకురాలు అరుణపేరి ఆజ్ఞతో శ్రీలలితా సహస్రనామ పారాయణం, శివానందలహరి పారాయణం, ఖడ్గమాలస్తోత్ర పారాయణం, లలితాత్రిశ తిస్తోత్ర పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు.